సాక్షి
వికారాబాద్

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



నిఘా పటిష్టం

ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పోలీసు నిఘా పటిష్టం చేసినట్లు వికారాబాద్ డీఎస్పీ నర్సింలు తెలిపారు. 10లో▸



మంగళగౌరీగా తుల్జామాత

దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దేముల్ తండాలో కొలువైన తుల్జామాత మంగళగౌరీగా దర్శనమిచ్చారు. 11లో▸




అన్నదాత ఆగమాగం

సాంకేతిక లోపాల కారణంగా ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అన్నదాతకు అందట్లేదు. 11లో▸

ఇమడలేక..!

కాంగ్రెస్ గూటికి మంత్రి పట్నం అనుచరులు

- పైలెట్‌తో పొసగక పక్క చూపులు
- అధికార పార్టీపై తీవ్ర ప్రభావం



వికారాబాద్: అధికార బీఆర్ఎస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు అభ్యర్థులకు ఇబ్బందిగా మారుతున్నాయి. గతంలో జిల్లాలోని ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఉన్న నేతలందరూ పట్నం మహేందర్‌రెడ్డితో జత కట్టారు. దీంతో అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వర్సెస్ మహేందర్‌రెడ్డి అన్నతరహాలో రెండు వర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. అయితే సీఎం కేసీఆర్ సిట్టింగులకే సీట్లు ఖరారు చేయడంతో తాండూరు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న మహేందర్‌రెడ్డి ఒకింత అసహనానికి గురయ్యారు. దీంతో ఆయన తన అనుచరులతో కలిసి పార్టీని వీడతారనే ప్రచారం కూడా జరిగింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహేందర్‌రెడ్డి పార్టీ వీడితే ఉమ్మడి జిల్లాలో పార్టీకి నష్టం చేకూరుతుందని భావించిన అధిష్టానం పెద్దలు నష్టనివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి కట్టబెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం, మహేందర్‌రెడ్డి మంత్రి పదవి తీసుకోవడంపై ఆయన అనుచరులు గుర్రుగా ఉన్నారు. ఇంతకాలం ఎమ్మెల్యేతో ఇబ్బందులు పడి ఒక్కటిగా ఉన్న తమను కాదని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మహేందర్‌రెడ్డి మంత్రి పదవి తీసుకున్నారని అనుచరులు బాహాటంగానే విమర్శించారు. అయితే మంత్రి పట్నం.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేయడం అనుచరులకు రుచించలేదు. దీంతో ఒక్కొక్కరుగా పార్టీ వీడటం మొదలు పెట్టారు. ఎమ్మెల్యే పైలెట్‌తో కలసి పని చేయలేమని భావించిన మంత్రి అనుచరులు పక్క పార్టీల వైపు చూశారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పటికే దాదాపు 80శాతం మంది హస్తం పార్టీలో చేరిపోయారు. మిగిలిన 20 శాతం మంది కూడా ఆయనతో అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. దీంతో ఎమ్మెల్యే వర్గానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ పరిస్థితి పార్టీకి మంచిది కాదని బీఆర్ఎస్ శ్రేణులు బాహాటంగానే అంటున్నారు.

కాంగ్రెస్‌కు క్యూ

జిల్లాలో మహేందర్‌రెడ్డి వర్గంలో సింహభాగం ఇప్పటికే పార్టీని వీడటం, మిగతా వారు కూడా అదే బాటలో నడుస్తుండటంపై పార్టీకి ఆందోళన కలిగిస్తోంది. ఇంకొందరు మరోలా ప్రచారం చేస్తున్నారు. మహేందర్‌రెడ్డితో సహా తామందరం ఎమ్మెల్యేలతో ఇబ్బంది పడి జతకడితే ఆయన మాత్రం మంత్రి పదవికి ఆశపడి తమను నట్టేట ముంచారని వాపోతున్నారు. అందుకే తాము పార్టీ వీడాల్సి వచ్చిందని నేతలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చినా పార్టీకి ప్రయోజనం చేకూరే సూచనలు కనిపించకపోవడం, నష్టమే ఉండడం బీఆర్ఎస్‌లో ఆందోళన కలిగిస్తోంది.

15లక్షల నగదు పట్టివేత

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ. 15లక్షల నగదు పట్టుబడినట్లు సీఐ శ్రీను తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. ఉదయం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. సిద్దులూర్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ నాగేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా తనిఖీ చేశారు. స్కూటర్ డిక్కీలో రూ 15లక్షలు దొరికాయి. అతన్ని విచారించగా వికారాబాద్ ఎస్‌బీఐ నుంచి ఇంటి లోన్ పొందినట్లు తెలిపారు. ఆ డబ్బు తీసుకెళుతున్న తెలిపారు. అయితే డబ్బు తిరిగి ఇచ్చే అధికారం తమకు లేనందున ఆ మొత్తాన్ని ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని, వారు రసీదులు పరిశీలించి సదరు వ్యక్తికి డబ్బు ఇస్తారని సీఐ తెలిపారు.

వ్యాపారి వద్ద..

తాండూరు టౌన్: పట్టణంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ వ్యాపారి వద్ద రూ. 3.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన పురుషోత్తం నగదు తీసుకెళుతుండగా స్థానిక శాంత్‌మహల్ చౌక్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బును ఎన్నికల అధికారులకు అందజేస్తామని, సరైన రసీదులు ఉంటే నగదు తిరిగి ఇచ్చేస్తామని పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.



తాండూరు టౌన్: పట్టుబడిన నగదుతో సీఐ రాజేందర్‌రెడ్డి

న్యూస్‌రీల్

నేడు బహుజన బతుకమ్మ

పాల్గొననున్న విమలక్క

బొంరాస్‌పేట: మండలంలోని రేగడిమైలారంలో బుధవారం బహుజన బతుకమ్మ నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సీ శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల బహుజన మహిళలతో గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువులో బతుకమ్మల నిమజ్జనం ఉంటుందన్నారు. ఈ సంబరాలకు అరుణోదయ కళాకారిణి విమలక్క హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

పల్లెప్రగతి పనుల పరిశీలన



అదాల్‌పూర్ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్‌కుమార్

యాలాల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం డీపీఓ తరుణ్‌కుమార్ పల్లెప్రగతి పనులను పరిశీలించారు. అదాల్‌పూర్, అన్నసాగర్, కోకట్ గ్రామ పంచాయతీల్లో పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయా పంచాయతీల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదయ్య, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం

డీఎస్పీ శేఖర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు రూరల్: రాజకీయాల పేరుతో గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శేఖర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరగడానికి నాయకులు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ గౌడి మంజుల, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో బ్రహ్మరథం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని, అందుకే ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం మూజాహిద్‌పూర్, అంతారం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ కృష్ణ, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి రామ్మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చే హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అంతారం సర్పంచ్ కృష్ణను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

ఆనంద్‌కు నిరసన సెగ

- రాంపూర్‌తండాలో ప్రచారానికి బ్రేక్
- గట్టెపల్లిలో అభివృద్ధిపై నిలదీసిన గ్రామస్తులు
- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు

ధారూరు: ఎన్నికల ప్రచారానికి బయలుదేరిన వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు మంగళవారం నిరసన సెగ తగిలింది. ఆయన రాకను అడ్డుకునేందుకు ధారూరు మండలం రాంపూర్‌తండా గిరిజనులు రోడ్డుకు అడ్డంగా రాళ్లు, హార్వెస్టర్లను అడ్డు పెట్టారు. అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులే ఆందోళన చేయడంతో అక్కడే ఉన్న వైస్ ఎంపీపీ విజయకుమార్ వారిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ.. నిజాం వారసురాలైన ఫజలున్నిసాబేగానికి చెందిన భూములను తాము వందేళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ధరణిని అడ్డం పెట్టుకుని సుమారు 70 ఎకరాల భూమిని ఎమ్మెల్యే అండతో స్థానిక తహసీల్దార్ రెండు కంపెనీలకు కట్టబెట్టారని మండిపడ్డారు. ఈ సమయంలో అండగా నిలబడాల్సిన ఎమ్మెల్యే కంపెనీలకే సహకరించారని ఆరోపించారు. తమ తండాలో ఆయనను ప్రచారం చేయనిచ్చేది లేదని మండిపడ్డారు. వైస్ ఎంపీపీ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తండాకు రాకుండా ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు.



రాంపూర్‌తండాలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గట్టెపల్లిలో అభివృద్ధిపై ఆందోళన..

ప్రచారంలో భాగంగా గట్టెపల్లికి చేరుకున్న ఎమ్మెల్యేను పలువురు స్థానికులు అభివృద్ధిపై నిలదీశారు. రోడ్లు బాగోలేవని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్ నాయకులు నిరసనకారులను దుర్భాషలాడి, ఇద్దరిపై చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న ఎస్ఐ సంతోష్‌కుమార్, పోలీసు సిబ్బంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- రూ.1,672 కోట్లతో తాండూరు రూపురేఖలు మార్చా
- మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



బషీరాబాద్: ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.1,672 కోట్లతో తాండూరును అభివృద్ధి చేశా.. మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం బషీరాబాద్ మండలం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను తాండూరు గడ్డమీద పుట్టిన బిడ్డనని, ఈ మట్టిలోనే కలిసిపోతానని అన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువయ్యారని విమర్శించారు. ఆ పార్టీ స్థానికేతరులను రంగంలో దింపాలని చూస్తోందని వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బషీరాబాద్ మండలాన్ని రూ.68.18 కోట్లతో అభివృద్ధి చేశానని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.10 కోట్లు తెచ్చానని గుర్తు చేశారు. ఏకాంబరి ఆలయ అభివృద్ధికి రూ. కోటి, మండల కేంద్రం అభివృద్ధికి రూ.3 కోట్లు ఇచ్చానని తెలిపారు. మల్కన్‌గిరి, గంగ్వార్, పర్యానాయక్ తండాలను కొత్త జీపీలుగా చేశానని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికీ రూ.50 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి చేశానన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యిందని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ.. రోహిత్‌రెడ్డి గెలుపుకోసం కార్యకర్తలు దీక్ష బూనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు కరణం పురుషోత్తంరావు, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

పెద్దేముల్: రాష్ట్రంలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం గోట్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో తాండూరు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. మన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కరణం పురుషోత్తంరావు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీపీ అనురాధ, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ చారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బీమాతో ధీమా



కేరెళ్ల గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ధారూరు: బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ప్రకటించిన కేసీఆర్ బీమాతో ప్రతి ఇంటికీ ధీమా లభిస్తుందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. మంగళవారం ధారూరు మండలం కేరెళ్లి, ఎబ్బనూర్, అల్లిపూర్, చింతకుంట, హరిదాస్‌పల్లి, స్టేషన్ ధారూరు, రుద్రారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో పుట్టి, తాండూర్‌లో స్థిరపడి, మర్పల్లిలో పేరు ఎక్కించుకున్న అతనికా మనం ఓట్లు వేసేది అని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ గురించి అన్నారు. నేను లోకల్ ఇక్కడే పుట్టా, ఇక్కడే చదివా, ఇక్కడి నుంచే ఎమ్మెల్యే అయ్యా అని అన్నారు. మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. పార్టీలకతీతంగా పని చేశానని, కష్టమని వచ్చిన వారికి అండగా నిలిచానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చి దిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంతోష్‌కుమార్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి డీఎస్పీ అభ్యర్థిగా రమేశ్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జెపల్లికి చెందిన రమేశ్‌ను పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రకటించారు. ఆమనగల్లులో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ.. డీఎస్పీ విజయం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాకేశ్, బాల్‌రాం, రాజు, వెంకటేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై సదస్సు

మొయినాబాద్‌రూరల్: సాంకేతిక టెక్నో ఆవిష్కరణలు, టెక్నో టెన్యూర్‌షిప్ మేధోసంపత్తి హక్కులపై కేఎల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని కేఎల్ యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన సదస్సుకు సత్యనారాయణతోపాటు జపాన్ దేశానికి సంబంధించిన ఎగ్జామినేషన్ పాలసీ ప్లానింగ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ ఇరోకి వటనాబే, ఏపీ చాంబర్‌ఆఫ్ కామర్స్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్ ఆర్‌వో పొట్లూరి భాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యాపార నిపుణులు, న్యాయ నిపుణుల మధ్య సంభాషణ.. సహకారాన్ని పెంపొందించడానికి ఈ సదస్సు ఒక ప్రత్యేక్షమైన వేదిక అని పేర్కొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, మేధో సంపత్తి, హక్కుల రంగాల్లో కీలకమైన అంశాలను చర్చించడానికి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యావేత్తలు, అనుభవజ్ఞులైన నిపుణులు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి సదస్సులు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం సదస్సుకు హాజరైన అతిథులను ఘనంగా సన్మానించారు.

గ్యాస్‌కు అధికంగా వసూలు చేస్తే జైలే

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్

కందుకూరు: గ్యాస్‌ను ఇవ్వాల్సిన గడువులోగా ఇవ్వకుండా.. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే జైలే అని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. కందుకూరులో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఉన్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల గురించి వాకబు చేశారు. స్థానిక ఏజెన్సీలో ఎప్పటి నుంచి కాల్స్ పెండింగ్‌లో ఉన్నాయి? ఎంత మందికి రీఫిల్స్ సరఫరా చేశారు? రసీదు ఇస్తున్నారా, లేదా? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్లకు డెలివరీ బాయ్‌లు అధికంగా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. నిర్ణీత ధర కంటే అధికంగా తీసుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దు

- డీపీఓకు తేల్చిచెప్పిన రైతులు
- పాత క్వారీలతో పంటలు నష్టపోతున్నామని వెల్లడి
- అనుమతులు ఇస్తే వలసబాట తప్పదని ఆవేదన
- ఆత్కూర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

పెద్దేముల్: ఇప్పటికే ఉన్న రాళ్ల క్వారీలతో బోరుబావులు, పంట పొలాలు దెబ్బతింటున్నాయని, కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వరాదని మండలంలోని ఆత్కూర్ గ్రామ రైతులు స్పష్టం చేశారు. ఇటీవల కొంతమంది ఆత్కూర్ సమీపంలో క్వారీల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ ప్రజాభిప్రాయ సేకరణ వచ్చారు. డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఉపాధి హామీ పీఓ నర్సింలు, ఇన్‌చార్జ్ ఎంపీఓతోకలసి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ ప్రభుకుమార్, రైతులు బ్రహ్మం, శివప్ప, బలిజ మాణిక్యప్ప, తుల్జప్ప మాట్లాడారు. గ్రామ పరిధిలోని క్వారీల నిర్వాహకులు బ్లాస్టింగ్‌లు చేస్తుండడంతో పెద్దపెద్ద రాళ్లు పొలాల్లో పడుతున్నాయని, దీంతో బోరుబావులు కూరుకుపోతున్నాయని తెలిపారు. పంటలు కూడా దెబ్బ తింటున్నాయని వివరించారు. కొత్త క్వారీల మాట అటుంచితే ఉన్న క్వారీలను కూడా వెంటనే మూసి వేయాలని డిమాండ్ చేశారు. తమ అభిప్రాయాన్ని కాదని క్వారీలకు అనుమతులు ఇస్తే తాము భూములు వదలి వలస వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. రైతుల మాటకు గౌరవం ఇస్తారో.. లేకుంటే రాళ్ల తవ్వకాలను అనుమతులు ఇస్తారో మీరే నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్పందించిన డీపీఓ ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరిస్తానని తెలిపారు.



రైతులతో కలసి క్వారీలను పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్‌కుమార్

క్లుప్తంగా

'మా సమస్యలు పరిష్కరించే పార్టీలకే మద్దతు'



మాట్లాడుతున్న రాఘవన్ నాయక్

అనంతగిరి: గిరిజనుల సమస్యలు పరిష్కరించే పార్టీలకే మద్దతు ఉంటుందని అఖిల భారత గిరిజన సమాఖ్య (ఏఐటీఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్, ప్రధాన కార్యదర్శులు సురేష్ నాయక్తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. గిరిజనులు, బంజారాలను రాజకీయ పార్టీలు కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నాయని, మేనిఫెస్టోలలో గిరిజనుల గురించి లేకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని గిరిజన, బంజారాల కోసం ఏ పార్టీ ఆలోచన చేయలేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అక్రమంగా కలప తరలిస్తున్న లారీ స్వాధీనం



పాలేపల్లిలో కలప లారీని పట్టుకున్న పోలీసులు

దోమ: అక్రమంగా కలప తరలిస్తున్న ఓ లారీని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. దోమ మండల పరిధిలోని పాలేపల్లిలో కొందరు వ్యాపారులు రైతుల పొలాల్లోని చెట్లను నరికేసి లారీలో లోడ్ చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు కలప రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలను అడిగారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో లారీని స్టేషన్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, లారీని ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని మున్సిపల్ కార్మికురాలు మృతి

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మున్సిపల్ కార్మికురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన పెద్దలావణ్య(40) కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో కార్మికురాలిగా పని చేస్తుంది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విధులు నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం లావణ్యను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మొయినాబాద్: వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ సమీపంలోని రాధాస్వామి సత్‌సంగ్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ రహదారి వెంట మంగళవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(45)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆట మాది.. ఓటు మీది!

ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు నేతలు పడుతున్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. బతుకమ్మ, దేవీశరన్నవరాత్రుల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న సంబరాల వద్దకు వెళ్లి సందడి చేస్తున్నారు. పనిలో పనిగా 'మీ అమూల్యమైన ఓటును నాకే వేయాలి' అని అభ్యర్థిస్తున్నారు.



తాండూరుటౌన్: మార్వాడీలు, గుజరాతీలతో కలిసి దాండియా ఆడుతున్న రోహిత్‌రెడ్డి



ధారూరు: ధారూరు: కేరెళ్లలో మహిళలతో బతుకమ్మ ఆడుతున్న ఆనంద్

యువకుడి నుంచి గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఆమనగల్లు పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్టీసీ బస్సులో వస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనివద్ద ఉన్న సూట్ కేసును తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. లక్షల రూపాయలు విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

సరిహద్దులో నిఘా పటిష్టం

వికారాబాద్ డీఎస్పీ నర్సింలు

- బొప్పునారం శివారులో వాహనాల తనిఖీ



బొప్పునారం శివారులో చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ నర్సింలు



మోమిన్‌పేట: మేకవనంపల్లి చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బంట్వారం: కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పోలీసు నిఘా పటిష్టం చేసినట్లు వికారాబాద్ డీఎస్పీ నర్సింలు తెలిపారు. బొప్పునారం శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో 24 గంటల పాటు వాహనాల తనిఖీ ఉంటుందన్నారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు పట్టుబడితే సీజ్ చేస్తామని తెలిపారు. అంతకు ముందు బంట్వారం ఠాణాలో ఎన్నికల కోడ్‌పై సమావేశం నిర్వహించారు. సభలు, ర్యాలీలకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకులు 48 గంటల ముందుగా సువిధ యాప్‌లో తప్పని సరిగా అనుమతి పొందాలని సూచించారు. మైక్ పర్మిషన్ ఇతర ఫిర్యాదుల కోసం సీవిజిల్ యాప్‌ను ఉపయోగించాలని ఆయన సూచించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని తెలిపారు. ఎవరైనా దీన్ని ఉల్లంఘిస్తే డయల్ 100కు కూడా సమాచారం అందించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ధారూరు సీఐ రామకృష్ణ, స్థానిక ఎస్‌ఐ ఆనంద్‌కుమార్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు..

మోమిన్‌పేట: మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మేకవనంపల్లిలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర జిల్లా చెక్ పోస్టు వద్ద విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగదు, బంగారం, నిషేధిత వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రులు, శుభకార్యాలకు అవసరమైన బంగారం, నగదు తీసుకెళ్లే వారు వీటికి సంబంధించిన పూర్తి వివరాలు దగ్గర పెట్టుకోవాలని సూచించారు.

ఎక్సైజ్ దాడుల్లో ఏడుగురిపై కేసులు

- గంజాయి, మద్యం, సారా స్వాధీనం
- బెల్లం ఊట ధ్వంసం
- ఎక్సైజ్ సీఐ అనంతయ్య
- బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరిక



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ, సబ్బంది

తాండూరు టౌన్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత తొమ్మిది రోజులుగా జరిపిన దాడుల్లో 19.5 కిలోల గంజాయి, 10 లీటర్ల నాటుసారా, 30 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు 850 లీటర్ల బెల్లం బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ అనంతయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ దాడుల్లో మొత్తం ఏడుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. నేనావత్ రాంసింగ్ అనే వ్యక్తి రెండోసారి నాటుసారా విక్రయిస్తూ పట్టుబడటంతో అతనికి రూ.1 లక్ష జరిమానా విధించి, వసూలు చేశామని తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల వద్ద ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని స్పష్టంచేశారు. బెల్టు షాపులు నిర్వహించే వారికై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ యాక్టు ప్రకారం ఒక వ్యక్తి ఒక కాటన్ బీర్లు (12), లేదా ఆరు మద్యం సీసాలు మాత్రమే తీసుకెళ్లాలని, అంతకు మించి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్ లాంటి పాలన కావాలి

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

తాండూరు: రాష్ట్రంలో ప్రజలు వైఎస్సార్ పాలనను కోరుకొంటున్నారని మెడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు నియోజవకర్గంలో కాంగ్రెస్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్ని పథకాలు ఇస్తానన్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ మాట మీద నిలబడని మనస్తత్వమని ప్రజలు గుర్తించారని అన్నారు. జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 70 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తోందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో సీఎంగా ఎవరైన అవుతారని, అదే బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ లేదా వారి కుటుంబ సభ్యులే సీఎం అవుతారని, మిగతావారికి అవకాశం ఉండదన్నారు. తాండూరు అసెంబ్లీ టికెట్ ఇంకా ఎవరికి ఖరారు కాలేదన్నారు. సీఈసీ సమావేశం తర్వాత రెండవ జాబితాలో పేరు ప్రకటిస్తారని తెలిపారు. కేఎల్ఆర్ అనే వ్యక్తి పార్టీలకు అమ్ముడుపోడని, గతంలో తనను పార్టీలోకి రమ్మని ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. తన వ్యాపారాలను దెబ్బతీశారని, అయినా కూడా బెదరలేదన్నారు. తాండూరు టికెట్ తనకే వస్తోందని నమ్మకంతో ఉన్నానన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్, నాయకులు నరేందర్, కోర్వార్ నాగేష్, మల్లికార్జున్, ఉత్తమ్‌చంద్, జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 50 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రం దుగోలి గ్రామానికి చెందిన మనోజ్ హైదరాబాద్‌కు వలస వచ్చి, హుస్సేనిఆలం వద్ద నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మాదక ద్రవ్యాలకు బానిసగా మారాడు. డ్రగ్ పెడ్లర్లతో మంచి సంబంధాలు ఏర్పడటంతో వినియోగదారుడి నుంచి పెడ్లర్‌గా అవతారం ఎత్తాడు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం నేరెడ్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలోని వాయుపురి బస్ స్టాండ్ వద్ద కస్టమర్‌కు డ్రగ్స్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తుండగా..విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, నేరెడ్‌మెట్ పోలీసులు మనోజ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన పూనమ్ చంద్ పరారీలో ఉన్నాడు.

వ్యక్తికి అసభ్యకర వీడియోకాల్

- డబ్బులివ్వాలని యువతి బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

యాచారం: అసభ్యకరంగా వీడియో కాల్ చేసిన ఓ మహిళ తాను పోలీస్ కానిస్టేబుల్‌నంటూ ఓ వ్యక్తిని భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని తక్కళ్లపల్లికి చెందిన తీగల చంద్రశేఖర్‌రెడ్డికి సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో ఓ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. ఇందులో ఓ మహిళా తాను కానిస్టేబుల్‌నంటూ అసభ్యకరంగా వీడియో కాల్ చేసి డబ్బులిస్తావా.. లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలా..? అని బెదిరింపులకు గురిచేసింది. దీంతో ఆందోళనకు గురైన చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉదయం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్‌తో కలిసి పీఎస్‌కు వెళ్లి సీఐ సైదయ్యకు ఫిర్యాదు చేశారు. సదరు మహిళా కాల్ చేసి ఫోను నంబరును సీఐకి అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... డబ్బులు లాగడం కోసం ఇలాంటి తప్పుడు ఫోన్ కాల్స్ వస్తుంటాయని, భయపడవద్దని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ నర్సింలు
- వివిధ పార్టీల నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింలు

మర్పల్లి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ డీఎస్పీ నర్సింలు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్ వద్ద మర్పల్లి ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారం కోసం సభలు, సమావేశాలు పెట్టేందుకు విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం రెండు రోజుల ముందే సువిధ యాప్‌లో వివరాలను పొందుపర్చాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది లేకపోతే దరఖాస్తు చేసుకున్న కొద్ది గంటల్లోనే పర్మిషన్ ఇస్తామని వివరించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకొనేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై తహసీల్దార్ గణేశ్ రాజకీయ నాయకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు అండగా నిలవండి

- వీర్లపల్లిని గెలిపించండి
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ కార్యకర్త అండగా నిలిచి.. పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. హైదరాబాద్ వెళ్లి పార్టీలో చేరిన పలువురికి రేవంత్ కాంగ్రెస్ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే ఆలోచిస్తుందని తెలిపారు. ప్రజలకోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను తీసుకువచ్చామని, అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని అమలు చేస్తామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో కొత్తూరు మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌గౌడ్, జెనిగ జగన్, మామిడి సిద్దార్థరెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ చిర్ర సాయిలు, మధురాపూర్ సర్పంచ్ శివారెడ్డి, రంగంపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, లింగంధన సర్పంచ్ ప్రతాప్, వేముల్‌నర్వ సర్పంచ్ మంజులమల్లేశ్, కాసులాబాద్ సర్పంచ్ గోపాల్, ఎదిర సర్పంచ్ బాల్‌రాజ్, పీర్జాపూర్ సర్పంచ్ రాములు, కొందుర్గు సర్పంచ్ ఆదిలక్ష్మి యాదయ్య, రాంచంద్రాపూర్ సర్పంచ్ జహంగీర్, వెంకిర్యాల సర్పంచ్ లింగంగౌడ్, చౌలపల్లి ఉపసర్పంచ్ శ్రీను, సింగిల్‌విండో మాజీ చైర్మెన్ చించోడ్ అనంతం, ఇప్పలపల్లి ఎంపీటీసీ మంజులరాజశేఖర్‌గుప్త, మాజీ సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ రాములు, కొత్తూరు ఎంపీటీసీ శ్రీను, చౌదరిగూడ మాజీ వైస్ ఎంపీపీ బాబు, మాజీఎంపీటీసీ బస్వరాజ్‌గౌడ్, వార్డు సభ్యులు ప్రభాకర్, రాములు, బాలయ్య, ప్రభాకర్, చంటి, రాఘవేందర్ ఉన్నారు.

రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి

- భార్యను హత్య చేసిన భర్త
- భవనంపై నుంచి దూకి తానూ ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం

నాగోలు: భార్య తలపై రోకలిబండతో మోది.. కత్తితో గొంతు కోసి హత్యచేసిన భర్త.. తానూ బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన తెలగమల్ల రాజు (45)కు, కందుకూరు మండలం ముచ్చర్లకు చెందిన పర్సన్ కృష్టమ్మ కూతురు సంతోషి (40) తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ కుటుంబం నగరానికి వచ్చి నాగోలు సాయినగర్ కాలనీలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. వీరి కుమార్తె సింధుజ ఇంటర్ మొదటి సంవత్సరం, కుమారుడు సాయిరాం 9వ తరగతి చదువుతున్నారు. రాజు సొంతంగా లారీ కొనుగోలు చేసి నడుపుతున్నాడు. వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడు. సంతోషి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో కొంత కాలంగా ఆయాగా పని చేస్తోంది. రాజు, సంతోషి మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఇరువురి మధ్య తగాదాలు ఘర్షణలు జరుగుతున్నాయి. సంతోషి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించేవాడని స్థానికులు చెబుతున్నారు.

ఏం జరిగిందంటే..?

సోమవారం సాయంత్రం సరూర్‌గర్ గ్రీన్ పార్క్ కాలనీలో ఉంటున్న రాజు చెల్లెలు మంజుల ఇంటికి కూతురు సింధుజ, కుమారుడు సాయిరాంతో కలిసి వెళ్లారు. అక్కడ రాత్రి భోజనాలు చేసిన అనంతరం భార్యాభర్తలిద్దరూ ద్విచక్ర వాహనంపై సాయినగర్‌లోని తమ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాజు, సంతోషి మధ్య ఘర్షణ జరిగింది. రాజు ఆవేశంతో సంతోషిపై ఇంట్లోని రోకలి బండతో మోదాడు. అనంతరం కత్తితో గొంతు కోశాడు. భార్య మృతి చెందిందని నిర్ధారించుకున్న రాజు.. ఇంటికి తాళం రాజు సరూర్‌నగర్‌లోని చెల్లెలు ఇంటికి వెళ్లాడు. అక్కడ భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం రాజు చనిపోయిన విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించి ఆయన చెల్లెలు మంజులకు చెప్పారు. సంతోషికి ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో మృతుడి రాజు బంధువులు సాయినగర్‌కు వచ్చి చూడగా ఇంట్లో రక్తపు మడుగులో ఆమె శవం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు నాగోల్ పోలీసులకు సమాచారం అందించారు. ఒకేరోజు తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

చోరీలకు పాల్పడుతున్న అన్నదమ్ముల రిమాండ్

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అన్నదమ్ములను రాజేంద్రనగర్ సీసీఎస్, శంకర్‌పల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు స్మార్ట్ గడియారాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ జగదీశ్వర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, కంది మండలం, కవివేముల గ్రామానికి చెందిన రాజు గౌడ్ పాత నేరస్తుడు. ఇతడిపై 31 కేసులు ఉన్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. జైలు నుంచి బయటికి వచ్చిన రాజు తన సోదరుడు శివ గౌడ్‌తో కలిసి నేరాలను ప్రారంభించాడు. ఈ నెల 12న శంకర్‌పల్లి ప్రాంతంలోని వంశీధర్ రెడ్డి ఇంటి తాళాలను పగలగొట్టి 9.5 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాత నేరస్తుల వివరాలను పరిశీలించగా రాజు గౌడ్, శివ గౌడ్‌లపై అనుమానంతో వారిపై నిఘా పెట్టారు. మంగళవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి వద్ద వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వారి నుంచి బైక్, రెండు స్మార్ట్ వాచ్‌లు, 19 తులాల బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాజు గౌడ్‌పై 31, శివ గౌడ్ 7 కేసులు నమోదయ్యాయన్నారు. రాజు గౌడ్‌పై పీడీ యాక్ట్ నమోదుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు డీసీపీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన శంకర్‌పల్లి పోలీసులు, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులను డీసీపీ అభినందించారు.

యూఎన్ వరల్డ్ ఫోరమ్ సదస్సుకు మేయర్

సాక్షి, సిటీబ్యూరో: యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో నిర్వహిస్తున్న వరల్డ్ ఫోరమ్ సదస్సుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఆహ్వానం అందింది. ఈమేరకు ఆమె బుధవారం ఈ సదస్సులో అర్బన్ ఫారెస్ట్రీ అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ఫోరమ్‌లో జీహెచ్ఎంసీకి ప్రాతినిధ్యం లభించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం, నగరంలో చేపట్టిన హరితహారం గురించి ప్రముఖంగా ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలి

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే సిబ్బంది స్పందించి పరిష్కరించాలని రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం శివరాంపల్లిలోని డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో వినియోగదారులు ఫిర్యాదులకు స్పందించినప్పుడే మంచి పేరు రావడంతో పాటు సేవలు అందించిన వారవుతామన్నారు. సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సేఫ్టీ పరికరాలను ధరించి పని చేయాలని సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన జూనియర్ లైన్‌మెన్‌లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు తమ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే ప్రాంతాల వారీగా మొబైల్ నంబర్లు ఇచ్చామని ఆయా నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలు సెక్షన్ అధికారులు, సిబ్బందికి వివరించాలన్నారు. ఈ కింద నంబర్లు ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) కాల్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని డీఈ తెలిపారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు సత్యనారాయణ, ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందితో సమావేశమైన రాజేంద్రనగర్ డీఈ పి.రత్నాకర్ రావు.